RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శనివారం 30.05.2026 సంపుటి : 03 సంచిక : 171 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Saturday 30.05.2026 Volume: 03 Issue 171 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక






జనోదయ



# రైతు వ్యతిరేక ఆర్డినెన్సుల దహనం

## కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఎస్‌కేఎం రైతు సంఘాల ఆగ్రహం



**జనోదయ : వరంగల్**

వరంగల్ టౌన్ కాశిబుగ్గ అంబేద్కర్ సెంటర్ వద్ద శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక ఆర్డినెన్సులకు నిరసనగా ఆర్డినెన్సుల ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ రైతు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతు వ్యతిరేక చట్టాలు అమలైతే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం భవిష్యత్తులో మరింత ఉద్ధృతంగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# బాలల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ఆగ్రంపహాడ్‌లో అంగన్వాడి భవన ప్రారంభం
## చిన్నారులతో ఎమ్మెల్యే రేవూరి అక్షరాభ్యాసం



**జనోదయ : ఆత్మకూరు**

ఆత్మకూరు మండలం ఆగ్రంపహాడ్ గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాలు ఘనంగా నిర్వహించగా, గ్రామంలో నూతన అంగన్వాడి భవనాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీ కేంద్రాలేనని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణతో పాటు చిన్నారుల విద్యాభివృద్ధిలో అంగన్వాడీల పాత్ర కీలకమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రీ–ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నదని, డైట్ చార్జీల పెంపుతో పాటు అత్యాధునిక విద్యా ప్రమాణాలతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్" ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మహిళా సాధికారత లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తోందన్నారు. పిల్లలకు పోషకాహారం, నాణ్యమైన ప్రాథమిక విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

# సోషల్‌లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

## డీఈఓ చేతుల మీదుగా సత్కారం
## సోషల్ ఫోరం సేవలకు ప్రశంసలు




**జనోదయ : హన్మకొండ**

వరంగల్ జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి సోషల్ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగయ్య నాయుడు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా సోషల్ ఫోరం చేపడుతున్న కార్యక్రమాలు ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. వరంగల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ మాట్లాడుతూ సోషల్ ఫోరం సేవలు విద్యారంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఫోరం నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయని తెలిపారు. సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్ మాట్లాడుతూ సోషల్ సబ్జెక్టులో 100 శాతం మార్కులు సాధించడం గర్వకారణమని, ఇందుకు విద్యార్థులు మరియు సోషల్ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని అన్నారు. ప్రధాన కార్యదర్శి పోలేపెల్లి రవి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం గౌరవ అధ్యక్షుడు మంగ రాజన్న, ఉపాధ్యక్షులు సాంబమూర్తి, ఉప్పల సతీష్, అన్న మహేందర్, చిట్టిబోతుల సంపత్, బిక్షపతి, కొల్లూరి శ్రీధర్, చిలివేరు శ్రీనివాస్, నేరెళ్ల రాజేందర్, బూర కుమారస్వామి, కోకిల సుధాకర్, గుడివాడ అశోక్, హనుమకొండ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసయ్యతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సహచరులను సాగనంపుతూ భావోద్వేగానికి గురైన గీసుగొండ పోలీసులు



## బదిలీ అయిన సిబ్బందికి ఘన వీడ్కోలు
## ఆప్యాయ క్షణాలతో నిండిన కార్యక్రమం

**జనోదయ : గీసుగొండ**

ఏళ్ల తరబడి కలిసి విధులు నిర్వహించిన సహచరులు బదిలీ అవుతుండటంతో గీసుగొండ పోలీస్ స్టేషన్ ఆవరణ శుక్రవారం భావోద్వేగ క్షణాలకు వేదికైంది. ఇటీవల బదిలీ అయిన ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ సుదర్శన్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, పోలీస్ కానిస్టేబుళ్లు మహేందర్, హరికృష్ణలకు పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సహచరుల మధ్య ఉన్న అనుబంధం, సేవా బంధం ప్రతి ఒక్కరినీ కదిలించింది. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, ప్రజల పట్ల సేవా తత్వాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి గురయ్యారు. బదిలీ అయిన అధికారులు, సిబ్బంది గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ "ఈ స్టేషన్ మా కుటుంబంలాంటిది.. ఇక్కడి అనుబంధాన్ని ఎప్పటికీ మర్చిపోలేం" అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. వారి మాటలు అక్కడున్న వారిని కదిలించాయి. అనంతరం సహచరులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజా సేవలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఆప్యాయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోపాలపూర్ ఊర చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన



**జనోదయ : హనుమకొండ**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపూర్ ఊర చెరువులో సుమారు రూ. 1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య,స్థానిక శాసన సభ్యులు కె.ఆర్. నాగరాజు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు చెరువుల నిల్వ సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గోపాలపూర్ పరిసర ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే వరద ముంపు సమస్యలను తగ్గించడంలో ఈ పూడికతీత పనులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం అవసరమని, చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,  కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్ ఫోకస్

### పరకాలలో బిఎల్ఏలకు ఘన శిక్షణా కార్యక్రమం
### ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
### ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**జనోదయ : ఆత్మకూరు**

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో దూకుడు పెంచింది. పరకాల నియోజకవర్గ పరిధిలోని గుడెప్పాడ్ క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల (బిఎల్ఏ'ఎస్) శిక్షణా కార్యక్రమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అయూబ్, టీపీసీసీ పరిశీలకుడు డాక్టర్ పులి అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)' ప్రక్రియపై ఏజెంట్లకు సుదీర్ఘంగా దిశానిర్దేశం చేశారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించనున్న నేపథ్యంలో, బీఎల్ఏలు స్థానికంగా ఉండి ఎన్యూమరేషన్ ఫారమ్ల పంపిణీ, సేకరణను పర్యవేక్షించాలని సూచించారు. జూలై 31న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల పేర్లు నమోదయ్యాయో లేదో నిర్ధారించాలని, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ప్రజలకు సహకరించాలని కోరారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒకే వ్యక్తి బహుళ ప్రాంతాల్లో ఓటరుగా నమోదు కాకుండా చూడాలని, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపులో బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని సూచించారు. అలాగే అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతీ యువకుడిని గుర్తించి ఫారమ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేయించాలని స్పష్టం చేశారు. వోటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్లను జశీవతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా పూర్తి చేయవచ్చని, ఈ సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, భారీ సంఖ్యలో బూత్ లెవెల్ ఏజెంటు పాల్గొన్నారు.




## టీచర్స్ కాలనీలో కాల్వపై అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించండి

### రామగుండం మేయర్ మహంకాళి స్వామి

**జనోదయ : గోదావరిఖని**

టీచర్స్ కాలనీ లో కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి వరద కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ , పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి శుక్రవారం టీచర్స్ కాలనీ , శ్రీ నగర్ కాలనీ సందర్శించారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా అంతరాయం కలగకుండా ఉండేందుకు వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ 4 కోట్లలో భాగంగా ప్రతిపాదించిన ఈ కాలువ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే వర్షాకాలంలో వరద ముంపు ఉండదని అన్నారు. పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఎం ఎల్ ఎ జారీ చేసిన ఆదేశాల మేరకు కాలువపై



వెలసిన అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలని అన్నారు. శనివారం నుండి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన వెంట కార్పొరేటర్లు వడ్లూరి రవి , గట్ల రమేష్ , చిదురాల నాగరాజు , బాలసాని తిరుపతి , టి పి ఎస్ నవీన్ , ఎ ఇ తేజస్విని తదితరులు ఉన్నారు.

## విద్యతోనే ఉన్నత స్థానం సాధ్యం



### వెంకటమ్మ జీవితం ఆదర్శం
### ఈసం వెంకటమ్మకు ఘన నివాళి అర్పించిన మడే పూర్ణిమ-బిక్షపతి దంపతులు

**జనోదయ : గోవిందరావుపేట**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ఎల్బీనగర్ గ్రామానికి చెందిన ఈసం బతుకయ్య హెడ్ కానిస్టేబుల్ తల్లి ఈసం వెంకటమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా, శుక్రవారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి దంపతులు హాజరై వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మడే పూర్ణిమ మాట్లాడుతూ... వెంకటమ్మ స్వయంగా విద్యను అభ్యసించకపోయినా, తన పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. ముఖ్యంగా తన కుమారుడు పోలీసు శాఖలో ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల ఆమె ఎంతో గర్వంగా భావించేవారని గుర్తుచేశారు. పిల్లలు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే తల్లిదండ్రులకు నిజమైన ఆనందం కలుగుతుందని ఆమె చెప్పేవారని పేర్కొన్నారు. అలాగే చదువు మనిషిని సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెడుతుందని, విద్య ద్వారానే కుటుంబ భవిష్యత్తు మారుతుందని వెంకటమ్మ తరచూ ప్రజలకు ప్రేరణనిచ్చేవారని మడే పూర్ణిమ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ హైదరాబాద్ డీఈ వెంకన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా ఏవోగా పదవీ విరమణ పొందిన పిన్నకుమార్ స్వామి తదితరులు పాల్గొని వెంకటమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఓటు హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

### ప్రతి బూత్లో కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం
### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**జనోదయ : పరకాల**

పరకాల నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేసి ఓటర్ల హక్కులను కాపాడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రతి బూత్లో కాంగ్రెస్ శక్తిని మరింత విస్తరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ క్రాస్ రోడ్డు వద్ద గల ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయుబ్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై ఎంపీ కడియం కావ్య సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా నిర్వహణలో పారదర్శకత ఎంతో కీలకమని, బూత్ స్థాయి కార్యకర్తలు స్థానిక ఓటర్లతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, కేంద్ర ఎన్నికల సంఘం లేదా పార్టీ నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు తప్ప




నిసరిగా హాజరై ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఓటరు జాబితాల్లో అక్రమాలు, దొంగ ఓట్ల చేరికలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా “ఓటు చోరీ” పేరుతో ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అధికార బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్ల తొలగింపులకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ వ్యాప్తంగా భారీ ఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. జూన్ 25 నుంచి తెలంగాణలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సిర్) మూడో దశ ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం కానుందని, ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు చేపడతారని తెలిపారు. డూప్లికేట్ ఓట్లు లేదా అక్రమాలపై ఎక్కడైనా అనుమానాలు తలెత్తితే వెంటనే స్థానిక కాంగ్రెస్ ఇన్చార్జ్లకు సమాచారం అందించాలని కార్యకర్తలకు సూచించారు.

# ప్రభుత్వ బడుల బలోపేతానికి యువత ముందుకు రావాలి

### పంతులుపల్లి పాఠశాలలో బడిబాట కార్యక్రమం
### యువత, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం

జనోదయ : నల్లబెల్లి

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం 2026-27 అమలులో భాగంగా నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో యువత, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రాంమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నాగరాజుపల్లి గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభ్యులు ఊటుకూరి కృష్ణ, స్థానిక లెగసీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న మోజును విడిచిపెట్టి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు.



సర్పంచ్ ఎరుకల లలిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఉచిత అల్పాహారం, 14 రకాల వస్తువుతో కూడిన కిట్ అందించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి బడీడు పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లెగసీ యువజన సంఘం సభ్యులు ఊటుకూరి విష్ణువర్ధన్, పెండ్లి విష్ణువర్ధన్, ఇంతల పవన్, అభిషేక్, విష్ణువికాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ వన్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరించండి

### సిఎండికి ఏఐటియుసి వినతి

జనోదయ : గోదావరిఖని

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్యం, మెటీరియల్ సరఫరా వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటియుసి అర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం సి అండ్ ఎండి జ్యోతి బుద్ధ ప్రకాశ్ అర్జీ-1లోని జిడికె 11వ ఇంక్లైన్ కు వచ్చిన సందర్భంగా ముందుగా ఆయనకు పూల బోకె అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతి పత్రంలో ప్రధాన డిమాండ్లను బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను సిఎండికి వివరించారు. ముఖ్యంగా అర్జీ-1లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ బెడ్ పనులు వెంటనే పూర్తి చేసి శుద్ధి చేసిన త్రాగునీరు అందించాలని కోరారు. ఏరియా హాస్పిటల్‌లోని క్యాథలాబ్ బోర్డు పేరును "సింగరేణి క్యాథలాబ్" గా మార్చాలని, మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్ల కు ఉద్యోగాలు ఇవ్వాలని, గనుల్లో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేసి ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఓసిపి-5 లో కొత్త దంపర్లు, షావల్స్, లోడర్లు మంజూరు చేయాలని, సి.ఎస్.ఆర్ నిధులను ప్రభుత్వ పథకాల కు కాకుండా కార్మిక కాలనీలు, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని




కోరారు. ఏరియా హాస్పిటల్ లో పూర్తిస్థాయి డాక్టర్లను నియమించి, అవసరమైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని, అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్స్, హ్యాండ్ గ్లౌసులు, శిలలు, నట్-బోల్ట్స్ తదితర మెటీరియల్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య నాయకులు మాదన మహేష్, ఎస్ వెంకట్ రెడ్డి, సిద్దమల్ల రాజు, పి.విజయలక్ష్మి, సిర్ర మల్లికార్జున్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు జీవనభృతి కల్పించాలి : గజ్జెల లింగమూర్తి

### రోడ్లపై నుంచి తొలగించడం బాధాకరం
### ప్రభుత్వ పెద్దలు సహాయం చేయాలి
### వరంగల్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో చిరువ్యాపారుల దౌర్జన్య తొలగింపుపై సంఘం ఆవేదన

జనోదయ : వరంగల్

ఎండా, వానా, చలిని లెక్కచేయకుండా రోడ్లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరువ్యాపారులను దౌర్జన్యంగా తొలగించడం సరికాదని వరంగల్ నగర చిరువ్యాపారుల సంఘం అధ్యక్షులు గజ్జెల లింగమూర్తి అన్నారు. నగరంలో జరిగిన చిరువ్యాపారుల సంఘం సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ.. హెడ్ పోస్టాఫీస్ పరిధిలో రోడ్డుకు ఇరుప్రక్కల వ్యాపారం చేసుకునే వారి బ్రతుకులకు భద్రత లేకుండా పో



యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో బ్రతుకుతున్న చిరువ్యాపారులకు ప్రభుత్వ పెద్దలు జీవనభృతి కల్పించి ఆదుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు ఎం. అరుణ, సరోజన, శోభ, రాజేశ్వరి, స్రవంతి, లక్ష్మి, స్వప్న, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఇది రోడ్డా? పండ్ల దుకాణమా?



### ట్రాఫిక్ పోలీసులే తేల్చాలి

జనోదయ : గోదావరిఖని

గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద పండ్ల దుకాణదారుల హవా కొనసాగుతుంది. దీంతో అక్కడ ట్రాఫిక్ జిగ్ జాగ్ గా మారింది. అసలు రోడ్డు ఉందా..? లేక రోడ్డుపైనే పండ్ల దుకాణాలు ఉన్నాయా? అనేది ఎవరికీ అర్థం కావడం లేదు. రోడ్డు అంచు వరకు పండ్ల దుకాణాలు పెట్టడం,ప్రత్యేక టేబుల్స్ వేసి వాటిపై పండ్లు పోయడం, కొనుగోలుదారులు రోడ్డు మధ్య వరకు వాహనాలు పార్కింగ్ చేయడం అక్కడ పరిపాటిగా మారింది. వీరిని ఇదేంది అనే నాథుడే కరువయ్యాడు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి అని దబాయిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ బ్రిడ్జ్ వేడెల్పు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలు మరింతగా పెరిగాయూ. ఇంత జరుగుతున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి పండ్ల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



జనోదయ : ఉమ్మడి ఖమ్మం ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగుతున్న మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సమీక్షించారు. జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ముందు రాత్రి కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న నిల్వలు తడిసాయేమోననే వివరాలు అధికారులతో ఆరా తీశారు. కొనుగోలుకేంద్రంలో టార్పాలిన్లతో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్నలను, నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలున్నాయని, ఇదేరోజు మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్ని లారీలు లోడింగ్ పూర్తి చేశారో, ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నలను గోదాములకు తరలించారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 28 వేల బస్తాలు గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# నకిలీ జీవోలు, అక్రమ భూ వ్యవహారాల ముఠా పట్టివేత

## ముగ్గురు నిందితుల అరెస్ట్ మరికొందరు పరారీలో

జనోదయ : శేరిలింగంపల్లి

గండిపేట గ్రామంలోని ప్రభుత్వ భూమికి సంబంధించిన నకిలీ జీవోలు సృష్టించి అక్రమ భూవ్యవహారా లకు పాల్పడిన ముఠాను సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నర్సింగి పోలీసులు వెల్లడించారు. గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు, గండిపేట గ్రామ సర్వే నంబర్ 18లో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు తమ పేర్లపై క్రమబద్ధీకరించుకున్నట్లు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తయారు చేసి వాటిని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై నర్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 990/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిమ్మల వెంకటగోపాల్, నిమ్మల రామస్వామి, నిమ్మల రాజేష్ నివాసాలలో కోర్టు అనుమతితో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ పాస్‌బుక్ , ఎంఓయూ పత్రాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీ



సుల విచారణలో, గండిపేట గ్రామానికి చెందిన దశరథ్ కుటుంబ సభ్యులు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వెంకటగోపాల్, నిమ్మల రామస్వామి, మంగా తదితరులు సుమారు పది ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడైంది. అయితే 2025 అక్టోబర్‌లో హైకోర్టు వారి పిటిషన్లను కొట్టివేసింది. అయినప్పటికీ, ఆ భూమిపై ఎటువంటి చట్టబద్ధ హక్కులు లేకపోయినా, నిందితులు బొల్ల రమేష్, బ్రహ్మనాయుడు తదితరులతో కలిసి ఎకరాకు రూ.3.5 కోట్ల చొప్పున భూమిని విక్రయించేందుకు కుట్ర పన్నారు. ఈ మేరకు ఎంఓయూలు కుదుర్చుకుని సుమారు రూ.4 కోట్ల వరకు నగదు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సునీల్, రాధాకృష్ణ తదితరులు మధ్యవర్తులుగా వ్యవహరించి నట్లు తెలిసింది. అలాగే నిందితులు నకిలీ జీవోలు, ఇతర ఫోర్జరీ పత్రాలు తయారు చేసి, ప్రభుత్వం భూమిని తమ పేర్లపై కేటాయించినట్లు తప్పుడు ప్రచారం చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ కేసులో అరెస్టు చేసిన నిందితులు: నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వెంకటగోపాల్, నిమ్మల సాయికిరణ్, పరారీలో ఉన్న బొల్ల రమేష్, బ్రహ్మనాయుడు, సునీల్, రాధాకృష్ణ తదితరుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూ లావాదేవీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సైబరాబాద్ పోలీసులు నకిలీ జీవోలు, ఫోర్జరీ భూపత్రాలు, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు సూచించారు. భూముల కొనుగోలు ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ద్వారా యాజమాన్య హక్కులను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని హెచ్చరించారు. భూకబ్జాలు,ఫోర్జరీ,మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సైబరాబాద్‌లో విద్యార్థుల రవాణాకు సురక్షిత వ్యవస్థ

## సీపీ డాక్టర్ ఎం.రమేష్

## 5 వేల మంది తల్లిదండ్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించిన సైబరాబాద్ పోలీసులు

జనోదయ : శేరిలింగంపల్లి

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల రవాణా భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై యూట్యూబ్ ద్వారా తల్లిదండ్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 5 వేల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. "స్టూడెంట్ మొబిలిటీ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్" పేరుతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా స్కూళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, విద్యార్థులకు సురక్షితమైన, అందుబాటు రవాణా కల్పించడం లక్ష్యమని సీపీ తెలిపారు. డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ..స్కూల్ డిస్పర్సల్ సమయంలో కేవలం 15 నిమిషాలలోనే సుమారు రెండు లక్షల వాహనాలు స్కూల్ పరిసరాలలోకి వస్తున్నాయని, దీంతో భారీ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీ ఎస్సీ) సంయుక్తంగా 526 విద్యాసంస్థలు, 4.1 లక్షల విద్యార్థులపై



నిర్వహించిన సర్వేలో రవాణా వ్యవస్థలో అనేక లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సేవలను సమన్వయం చేయడంతో పాటు, పోలీస్ వెరిఫైడ్ గిగ్ వర్కర్లు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని విద్యార్థుల భద్రత పర్యవేక్షణలో భాగస్వామ్యం చేయనున్నట్లు చెప్పారు. అన్ని వాహనాలలో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని సైబరాబాద్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్.శ్రీనివాస్, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ఎస్సీ ఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువులో గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య



## ఆచూకీ తెలిసిన వారు మాదాపూర్ పోలీసులను సంప్రదించాలి

జనోదయ : శేరిలింగంపల్లి

2026 మే 29న ఉదయం సుమారు 11:00 గంటల ప్రాంతంలో ఒక గుర్తు తెలియని మహిళ దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందడంతో వెంటనే మాదాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం హైడ్రా సిబ్బంది సహాయంతో దుర్గం చెరువు నీటిలో గాలింపు చర్యలు చేపట్టగా ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం బయటపడింది. మృతురాలిని పరిశీలించగా, ఆమె వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండగా, చామనచాయ రంగుతో, నలుపు రంగు వెంట్రుకలు కలిగి ఉంది. మృతురాలు నలుపు రంగు చుడిదార్, క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉన్నది. ఈ మహిళకు సంబంధించిన ఏవైనా వివరాలు లేదా ఆచూకీ తెలిసిన వారు వెంటనే మాదాపూర్ పోలీస్ స్టేషన్ సెల్ నెంబర్ 8712663109 కు లేదా డి.కృష్ణ మోహన్, ఎస్‌హెచ్‌ఓ మాదాపూర్ సెల్ నెంబర్ 8712663100 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# కొండా దంపతుల వివాహ మహోత్సవం భక్తులకు పండ్లు పంపిణీ

## కనకదుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

## టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్

## ఆదర్శ దంపతులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి


## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రార్థనలు

జనోదయ : వరంగల్

ఆదర్శ దంపతులు, జన హృదయ నేతలు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ల వివాహ మహోత్సవం సందర్భంగా నర్సంపేట రోడ్డులోని శ్రీ కనకదుర్గ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు, బాటసారులకు పెద్ద ఎత్తున పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. కొండా దంపతులు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. కొండా దంపతుల అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాల్లో ప్రార్థనలు పెద్ద ఎత్తున చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ క్యాతం రవీందర్, స్టేషన్ రోడ్ ఆటో




యూనియన్ ప్రెసిడెంట్ పప్పు వేణు, ఎర్ర రవి, కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, ఎర్రం కమల్, పోలేపాక విశాల్ బాబు, బూర మహేందర్, మిట్టపల్లి సాంబయ్య, బల్ల సదానందం, సర్దార్ జస్వీర్ సింగ్, కంచర్ల వేణు గౌడ్, నాగరాజ్, కొగిల యాకూబ్, రాజేందర్, ఠాగూర్ బజరంగ్ సింగ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు గూడ శారద, గూడ రమ్య, బూర గాయత్రి, స్వప్న, పద్మ, శ్రీదేవి, సుజాత, స్వరూప రాణి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

### కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్‌లో కేంద్ర మద్దతు ధరల జీవో దగ్ధం
### ఎస్‌కేఎం పిలుపు
### స్వామినాథన్ సిఫార్సులకు విరుద్ధంగా నామమాత్రపు ధరలు
### పత్తికి 11,000, వరికి 3,500 ఇవ్వాలని డిమాండ్

జనోదయ : వరంగల్




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 27 నుండి 31 వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ వేదిక ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం నగరంలోని కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మద్దతు ధరల జీవో ప్రతులను రైతు సంఘాల నాయకులు తగులబెట్టారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల ఉప సంఘం ఈ ఖరీఫ్ సీజన్లో 14 రకాల వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించిందని, ఇవి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేవని రైతు సంఘాల నాయకులు అన్నారు. 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు అమలు చేస్తామని ప్రకటించి, నేడు నామమాత్రపు మద్దతు ధరలు ప్రకటించిందని వారు విమర్శించారు. రోజురోజుకు విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, డీజిల్, సాగునీరు, విద్యుత్ ధరలు పెరుగుతుంటే వాటిని అరికట్టడంలో వైఫల్యం చెంది రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని సంఘాల నాయకులు దుయ్యబట్టారు. కేంద్రం మొక్కజొన్నకు 10 రూపాయలు, వరికి 72 రూపాయలు, పత్తికి 557 రూపాయలు మద్దతు ధర పెంపుగా ప్రకటించిందని, ఇది తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంట నుండి పడేసే 'తాలు' కంటే అధ్వాన్నమన్నారు. పత్తికి రూ. 11,000, వరికి రూ. 3,500, మొక్కజొన్నకు రూ. 3,000గా మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఆల్ ఇండియా కిసాన్ సంఘం జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, అఖిలభారత సంయుక్త కిసాన్ సభ జిల్లా అధ్యక్షులు వల్లందాస్ కుమార్, బండి వెంకటేశ్వర్లు, బొల్లు ఎల్లయ్య పాల్గొన్నారు.

# నాలుగేళ్ల సేవలకు సెల్యూట్

### మడికొండ పోలీసుల ఘన వీడ్కోలు



**జనోదయ, మడికొండ:**

హనుమకొండ జిల్లా మడికొండ పోలీస్ స్టేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహించిన జయరాజు, రామనాథం, రాజుకు సాధారణ బదిలీలలో భాగంగా స్థానచలనం కల్పించారు. సీపీ ఉత్తర్వుల మేరకు జయరాజును కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు, రామనాథంను శాయంపేట పోలీస్ స్టేషన్‌కు, రాజును వరంగల్ ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో సీఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్ల సేవలను కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారు చూపిన కర్తవ్యనిబద్ధత, సేవాభావాన్ని అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. సహచర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేయగా, కొత్త బాధ్యతల్లో కూడా ప్రజాసేవలో అదే అంకితభావంతో కొనసాగాలని ఆకాంక్షించారు.

# 108 కలశాలతో గీసుకొండ గుట్టపై ఆధ్యాత్మిక వైభవం

### శ్రీ సుదర్శన నారసింహ హోమంలో భక్తుల సందడి
### వేదమంత్రాలతో మార్మోగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

జనోదయ : గీసుగొండ



వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని చారిత్రక శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్ట ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. స్వాతి నక్షత్రం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 108 కలశములతో అత్యంత వైభవంగా శ్రీ సుదర్శన నారసింహ హోమం, మహాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. యాదగిరిగుట్టకు చెందిన రిటైర్డ్ అయ్యగారు వజ్జల వెంకటరామనర్సింహాచారి ఆధ్వర్యంలో ఐదుగురు అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య హోమ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గుట్ట ప్రాంగణం అంతా భక్తి పరవశంతో మార్మోగగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఏనుగుల మంజుల--సాంబరెడ్డి దంపతులు, వైస్ చైర్మన్ చాడ మాధవి--సంజీవరెడ్డి దంపతులు, ఏనుగుల ప్రమీల--రాంరెడ్డి దంపతులు, రామా విజయ--కుమారస్వామి దంపతులు, పసుల రాధిక--శివన్నారాయణ దంపతులు, దేవాలయ కమిటీ సభ్యులు ముల్క మార్కండేయ, సత్యనారాయణ, ప్రసాద్ వాజిపాయి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగమయ్యారు. ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించిన ఈ వేడుక గీసుకొండ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించండి

### సీపీ సన్‌ప్రీత్ సింగ్
### చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే అణిచివేత తప్పదు
### – కిట్స్‌లో నేర సమీక్షా సమావేశం
### రాత్రి బెల్ట్ షాపులు మూయించాలి, రోడ్లపై బర్త్‌డే పార్టీలు చేస్తే కేసులు – అధికారులకు సీపీ ఆదేశం

జనోదయ : వరంగల్





చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ.. సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించే రౌడీ షీటర్ల పట్ల అణిచివేత ధోరణితో ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. నెలవారీ నేర సమీక్షా సమావేశంలో భాగంగా కిట్స్ కళాశాలలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే రౌడీ షీటర్ల కౌన్సెలింగ్‌లో వంద శాతం రౌడీ షీటర్లు అందరూ హాజరు కావాలని, ప్రతి నెల ఒకమారు స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారిని తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. తనిఖీ సమయాల్లో లేని రౌడీ షీటర్ల కదలికలపై వివరాలను సేకరించాలని సూచించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి సమయాల్లో బెల్ట్ షాపులను మూయించాలని, అలా చేయకుంటే వారిపై కేసులు నమోదు చేయడం లేదా బైండోవర్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయాల్లో షాపులను మూయించాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ అధికారిపై ఉందని తేల్చిచెప్పారు. రాత్రి సమయాల్లో రద్దీ ఉండే ప్రాంతాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇకపై రాత్రి సమయాల్లో ఎవరైనా రోడ్లపై జన్మదిన వేడుకలు జరుపుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీ హెచ్చరించారు. చోరీల కట్టడికై ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇండ్లతో పాటు ఇతర వ్యాపార సంస్థల్లో పనులు చేసే వారి వివరాలు, హాస్టళ్ల నిర్వహణకు సంబంధించిన వివరాలు సైతం స్థానిక పోలీసులు సేకరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుండి ప్రజలకు అందుబాటులో ఉండాలని, నేరస్థుల అరెస్టు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాల చోరీ అయితే వెంటనే కేసు నమోదు చేయాలని, "మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేస్తే ప్రజలకు న్యాయం చేసినట్లే" అని సీపీ పేర్కొన్నారు. అనంతరం పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్టు, కేసుల్లో కొనసాగుతున్న దర్యాప్తు తీరుతెన్నులు, నేర నియంత్రణకై తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కార చర్యలపై సీపీ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, దార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్ కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.